సాక్షి

# మెట్రో ఫేజ్-2కు అనుమతులివ్వండి

## కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి

- కేంద్రంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధమని వెల్లడి
- బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌తో భేటీ



కేంద్ర మంత్రి ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఉత్తమ్, ఎంపీలు రఘువీర్, మల్లు రవి

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రితో ఆయన నివాసంలో సీఎం సమావేశమయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్-2 అవసరం ఎంతో ఉందని చెప్పారు. రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడి ప్రాజెక్టుగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. మెట్రో ఫేజ్-2 సాకారమైతే నగరంలో రాకపోకలు వేగంగా సాగడంతో పాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని..నగర సుస్థిరాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి ప్రాజెక్టు డీపీఆర్ సమర్పించిన విషయాన్ని గుర్తుచేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి కూడా అవసరమైన అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

**తెలంగాణ విజన్ భేష్: టోనీ బ్లెయిర్**

తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ అద్భుతంగా ఉందని బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997-2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా పని చేసిన ఆయన.. రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహరచన... వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో 'టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐజీసీ)'ను స్థాపించారు. ఈ నేపథ్యంలో భారత్‌లో పర్యటిస్తున్న టోనీ బ్లెయిర్‌తో గురువారం ఢిల్లీలో రేవంత్‌రెడ్డి గంటకు పైగా భేటీ అయ్యారు. తెలంగాణలో రైతులు, యువత, మహిళలు వంటి విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 ముఖ్య అంశాలను తెలియజేస్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రజలకు వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా టోనీ బ్లెయిర్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రణాళిక సుస్థిరాభివృద్ధి దిశగా ఉందని ప్రశంసించారు. అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి సంబంధించిన ఆసక్తి వ్యక్తీకరణ పత్రాన్ని(లెటర్ ఆఫ్ ఇంటెంట్) తెలంగాణ ప్రభుత్వం, టీబీఐజీసీ ప్రతినిధులు మార్చుకున్నారు. మంత్రి ఉత్తమ్, ఎంపీలు మల్లు రవి, రఘువీర్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఏపీ జితేందర్‌రెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి, ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, విష్ణువర్ధన్‌రెడ్డి, గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.